

మంత్రి కేటీఆర్‌కు షిర్డీసాయిబాబా చిత్రపటాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నేత డాక్టర్ ఎరవెల్లి చంద్రశేఖర్‌రావు, పోతుగల్ పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు బాపురావు



కొండా లక్ష్మణ్‌బాపూజీ, సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ విగ్రహాలకు పూలమాల వేస్తున్న మంత్రి కేటీఆర్



తెలంగాణభవన్‌లో సిరిసిల్ల బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కేటీఆర్ ఆశీర్వదిస్తున్న ముస్లిం మతపెద్దలు

# నాకు రాజకీయ భిక్షపెట్టిందే సిరిసిల్ల

- మీ ఆశీర్వాదంతోనే ఈ స్థాయికి ఎదిగా
- దేశం గర్వించేలా అభివృద్ధి చేశా..
- ఇంకా చేయడానికి సిద్ధంగా ఉన్నా..
- తొమ్మిదిన్నరేండ్ల అభివృద్ధిని చూడండి
- మీ బిడ్డగా మరోసారి ఆశీర్వదించండి
- సిరిసిల్ల నియోజకవర్గ ప్రజలకు మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి
- మహనీయులను స్మరించుకొని నామినేషన్ దాఖలు



తెలంగాణభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 9 (నమస్తే తెలంగాణ): 'నాకు రాజకీయ జన్మనిచ్చిన సిరిసిల్ల నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన. నన్ను నాలుగు సార్లు గెలిపించారు. ఐదోసారి జరుగుతున్న ఎన్నికల్లోనూ మీ బిడ్డగా భారీ మెజార్టీతో ఆశీర్వదించండి' అని సిరిసిల్ల బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. తొమ్మిదిన్నర ఏండ్లలో సిరిసిల్లను దేశం గర్వించేలా తీర్చిదిద్దానని, తాను చేసిన అభివృద్ధిని వివరిస్తూ రూపొందించిన ప్రగతి నివేదికలను ఇంటింటికీ పంపిస్తానని చెప్పారు. యాభై ఐదేండ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ ఏం చేశాయో ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. గురువారం ఆయన సాదాసీదాగా సిరిసిల్ల అభ్యర్థిగా బీఆర్ఎస్ నుంచి నామినేషన్ వేశారు. అనంతరం జిల్లాకేంద్రంలోని తెలంగాణ భవన్‌కు వెళ్లి, ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనకున్న ధైర్యం, బలం, బలగం.. నాయకులు, కార్యకర్తలేనని స్పష్టం చేశారు. తామే అభ్యర్థి అన్న విధంగా రేయింబవళ్లు శ్రమిస్తూ తనను మరోసారి మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని కోరారు.

### నాడు ఎట్లుండె సిరిసిల్ల.. నేడు ఎట్లయ్యింది..

నాడు సిరిసిల్ల ఎట్లుండె.. నేడు ఎట్లయ్యిందో.. నేను చేసిన పనులు మీ కండ్ల ముందే కనిపిస్తున్నామని మంత్రి వివరించారు. వస్త్ర పరిశ్రమకు జీవం పోసి నేతన్నల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చేశానని తెలిపారు. అసాధారణమైన ప్రగతితో జిల్లాకు కావాల్సిన అన్ని హంగులను సమకూర్చిపెట్టానని చెప్పారు. ఈ ప్రాంత విద్యార్థుల ఉన్నత చదువులకు నోచుకునేలా మెడికల్, వ్యవసాయ పాలిటెక్నిక్, వ్యవసాయ కళాశాల, నర్సింగ్, జేఎన్‌టీయూ, ఐటీఐ కాలేజీలు, అంతర్జాతీయ శిక్షణ సంస్థను ఏర్పాటు చేశానని చెప్పారు. గోదావరి జలాలతో మెట్టను అభిషేకిస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామన్నారు. మధ్యమానేరు ప్రాజెక్టు పూర్తి కావడంతో సిరిసిల్ల మానేరులో 360రోజులు నీటితో కోనసీమను తలిపించేలా చేశానన్నారు.

### మరింత అభివృద్ధి చేస్తా..

మీ ఆశీర్వాదంతో.. మీ అండదండలతో ఈ స్థాయికి ఎదిగానని అమాత్యుడు కృతజ్ఞతగా చెప్పారు. సిరిసిల్లను ఇంకా అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను గెలిపించాల్సిన బాధ్యత వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తనపై ఉందన్నారు. నాకున్న ఒత్తిడి వల్ల గడపగడపకూ రాలేక, మీ అందరిని కలువలేకపోతున్నానన్నారు. కానీ, నన్ను గుండెల్లో పెట్టుకున్న సిరిసిల్ల ప్రజలు, కార్యకర్తలంతా కలిసి భారీ మెజార్టీతో గెలిపించి దీవిస్తారన్న నమ్మకం ఉందన్నారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉన్న వ్యక్తినని, ప్రజల ఆలోచన సరళికి దర్పం పట్టే విధంగా ఈ ఎన్నికల్లో ఫలితాలు ఉండబోతున్నాయన్నారు. కాంగ్రెస్, బీజేపీ సిరిసిల్లకు ఏం చేశాయో..? ఆ పార్టీ నాయకులను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తాత్కాలిక ప్రయోజనాలకు లొంగిపోతే.. మళ్లీ యాభై ఏండ్లు బాధపడాల్సి వస్తుందని హెచ్చరించారు. సిరిసిల్ల ప్రజలపైనా, మా నాయకత్వంపైనా పూర్తి విశ్వాసం ఉందన్నారు. ఎవరూ ఎన్ని ప్రలోభాలు పెట్టినా.. కుట్రలు చేసినా.. కుతంత్రాలు పన్నినా సిరిసిల్ల ప్రజలు అభివృద్ధి కాముకులు, చైతన్యవంతులన్నారు. ఎన్నిమాటలు చెప్పినా.. ఎన్ని పిట్ట కథలు చెప్పినా లొంగిపోరన్నారు. కండ్ల ముందు కనిపిస్తున్న అభివృద్ధి, ఇంటింటికీ చేరుతున్న సంక్షేమం ఈ రెండు తప్పకుండా గెలిపిస్తాయన్న నమ్మకం నాలో ఉందన్నారు. నిర్విరామం లేకుండా.. సిరిసిల్ల ప్రజల కోసం పదిహేనేండ్లుగా పని చేశానని తెలిపారు. తనను మరోసారి మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని కోరారు. అభివృద్ధి, ప్రగతి ప్రస్థానంతో గౌవర ప్రదమైన మెజార్టీతో తిరిగి గెలుస్తానన్న సంపూర్ణ విశ్వాసం తనకు ఉందన్నారు. నాకున్న ధైర్యం, నాబలం నా గులాబీ దండు.. నా అన్నలు, తమ్ముళ్లు, నాయకులు, కార్యకర్తలేనని స్పష్టం చేశారు. తామే అభ్యర్థి అన్నవిధంగా రేయింబవళ్లు శ్రమిస్తూ తనను నాలుగు ఎలక్షన్లలో గెలిపించారని చెప్పారు. ఐదో ఎన్నికల్లో కూడా తనకు విశ్వాసం ఉందన్నారు. కరెంట్, నీళ్లు ఇవ్వని కాంగ్రెస్, సంక్షేమం ఇవ్వని బీజేపీకి ఓటేద్దామా..? తొమ్మిదిన్నరేండ్లు మీ లో ఒకడిగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి దోహద పడ్డ కేసీఆర్ అభ్యర్థిగా తనకు ఓటేస్తారా..? అని ప్రజలు ఆలోచించాలని సూచించారు. కార్యక్రమంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ వేయడానికి వెళ్తున్న మంత్రి కేటీఆర్‌కు తెలంగాణ భవన్ వద్ద గుమ్మడికాయతో దిష్టితీస్తున్న మహిళ



కత్తుల వంతెన ఆడియో సీడీని ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్



జిల్లా కేంద్రంలో చీర్లవంచకు చెందిన సత్తవ్వతో ఆప్యాయంగా మాట్లాడుతున్న సిరిసిల్ల బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కేటీఆర్

# తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలి

- ఎన్నికల పోలీస్ పరిశీలకురాలు వినిత్ సాహు, ఎస్పీ అఖిల్ మహాజన్
- జిల్లెల్ల, కొదురుపాకలో చెక్‌పోస్టుల తనిఖీ



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎన్నికల పోలీస్ పరిశీలకురాలు వినీత సాహు

సిరిసిల్ల రూరల్, నవంబర్ 9: జిల్లా సరిహద్దులలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులలో పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని ఎన్నికల పోలీసు పరిశీలకురాలు వినిత్‌సాహు పేర్కొన్నారు. గురువారం తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులోని సరిహద్దు చెక్‌పోస్టును ఆమె ఆకస్మికంగా తనీఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టులోని రిజిస్ట ర్లను పరిశీలించి, స్టాటిక్ సర్వే లైన్ బృందాలకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు నగదు, బంగారం, ఇతరత్రా కానుకల పంపిణీ చేసే అవకాశం ఉందని, ప్రతి వాహణాన్ని క్షణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ అకౌంటింగ్, వీడియో సర్వేలైన్స్, వ్యయ పరిశీలకుల బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాలన్నారు. సరైన ఆధారాలు లేకుండా భారీ ఎత్తున నగదు,బంగారం వంటివి తరలిస్తే వెంటనే సీజ్ చేసి,సంబంధిత అధికారులకు అప్పగించాలన్నారు. సీజ్ చేసిన వస్తువులకు వివరాలతో కూడిన రసీదులు అందజేయాలన్నారు. ఆమె వెంట ఆర్ఎస్ఐ జునైద్, చెక్ పోస్టు సిబ్బంది ఉన్నారు.

### ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

వేములవాడ, నవంబర్ 9: ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి పూర్తి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అధికారులకు సూచించారు. ఎన్నికల సందర్భంగా గురువారం బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొదురుపాక చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేశారు. వాహన తనిఖీలు చేసి నమోదు చేసిన రిజిస్టర్‌ను పరిశీలించడంతో పాటు, ప్రత్యక్షంగా పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీలు చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడారు. సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి నగదు, మద్యం రవాణాను అరికట్టాలని సూచించారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం ఉంటే డయల్ 100కి లేదా సంబంధిత పోలీస్‌స్టేషన్ వారికి సమాచారం అందించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎన్నికల నియమావళి ప్రకారం చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను డీఎస్పీ నాగేంద్రాచారితో కలసి పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు.